క్లుప్తంగా

ఈవీఎంల 3వ ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

ఏలూరు(మెట్రో): జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంల మూడో ర్యాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల సాధారణ, పోలీసు పరిశీలకుల సమక్షంలో నిర్వహించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో నిర్వహించిన ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా పోలీస్ అబ్జర్వరు టి.శ్రీధర్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు డా.కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఏ రామన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు



ఎన్నికల సాధారణ పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్

ఏలూరు(మెట్రో): ప్రజాస్వామ్య పండుగలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ అన్నారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ పాయింట్‌లో ఆయన సెల్ఫీ దిగారు. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని మృతుడు

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నూజివీడు రైల్వే స్టేషన్ దాటిన అనంతరం రామిలేరు రైల్వే బ్రిడ్జిపై నుంచి రైలు వెళుతుండగా సుమారు 30 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతిచెందాడు. మృతుడు సుమారు 5.6 అడుగుల ఎత్తు, నల్లని జుట్టు, నల్లని గడ్డం కలిగి ఉన్నాడు. మృతుడు అకుపచ్చ రంగు పొట్టి చేతుల టీషర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని ఎడమ మోచేతి కింద మమ్మి అనే ఇంగ్లీష్ అక్షరాలతో పచ్చబొట్టు, కుడిచేయి మోచేతి కింద పాపున్ అను ఇంగ్లీష్ అక్షరాలతో పచ్చబొట్టు కలిగి ఉన్నాడు. కుడిచేతికి జగన్ కోసం సిద్ధం అనే నీలం రంగు చేతిబ్యాండ్ కలిగి ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచామని ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 95020 97672కు సంప్రదించాలని, కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు ప్రాధాన్యత

- కమ్యూనిటీ బిల్డింగ్‌లకు నిధులు, స్థలాల కేటాయింపు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం



రూ.17 లక్షలతో నిర్మించిన రజక సంఘ భవనం



ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయీబ్రాహ్మణులు

ఏలూరు (టూటౌన్): గత పాలకులకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. వారికి పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడంతో పాటు, ఏలూరు నియోజకవర్గంలోని పలు బీసీ సంఘాలకు కార్యాలయాలు, 25 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు, నిధులు ఎమ్మెల్యే ఆళ్ల నాని కేటాయించారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో బీసీ సంఘాలు తమ జిల్లా కార్యాలయాల ఏర్పాటుతో పాటు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి పూనుకుంటున్నాయి. గతంలో వీరు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయారు. దానికి భిన్నంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే వారి ఆశలు నెరవేరాయి. దీంతో బీసీలు పట్టలేని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు బ్రహ్మరథం పడుతున్నారు.

స్థలాలు, నిధుల కేటాయింపు ఇలా..

- ఏలూరులో యాదవ సంఘం జిల్లా, నగర కార్యాలయానికి 350 గజాల స్థలం, ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచి రూ.14 లక్షలు అందించారు.
- రజక సంఘానికి స్థలాన్ని, రూ.14 లక్షలు ఎంపీ, ఎమ్మెల్యే నిధులు అందజేశారు. తెలుకుల సంఘానికి 500 గజాల స్థలం, రూ.10 లక్షలు నిధులు, శ్రీశయన సంఘానికి ఎంపీ,ఎమ్మెల్యే నిధులు రూ.14 లక్షలు అందించారు.
- గౌడ సంఘం, నాయీబ్రాహ్మణ సంఘాలకు స్థలాలతో పాటు రూ.10 లక్షలు చొప్పున నిధులు అందించారు.
- ఏలూరులో దాదాపు 20కు పైగా బీసీ సంఘాలకు నిధులు, స్థలాలు కేటాయించారు.

లబ్ధి పొందిన బీసీ కులాలివీవే..

మేదర, కాళింగులు, శెట్టిబలిజ, నాయీబ్రాహ్మణ, తెలికుల, పద్మశాలి, తూర్పుకాపు, సగర్లు, చెంచులు, దేవాంగులు, నూర్ బాషా, యాదవ, రజకులు, కొప్పుల వెలమ, విశ్వబ్రాహ్మణ, గౌడ, స్వర్ణకారులు, ప్రైవేట్ ఎలక్ట్రికల్స్, ఏసీ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం, గణపతి ఖాదీవ్యాపారుల సంక్షేమ సంఘం, ఏపీ సకల కళాకారుల, హేలాపురి వైష్ణవ సేవ సంఘం, బెంగాలి గోల్డ్ స్మిత్, శ్రీశయన, నాగవంశీయులు తదితర బీసీ కులాలు, సంఘాలకు భవన నిర్మాణాలకు స్థలాలు, నిధులు కేటాయించారు.

వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలి



బీసీలకు కొండంత అండగా ఎమ్మెల్యే ఆళ్ల నాని నిలిచారు. అడిగిన వారికి లేదనకుండా మేలు చేశారు. గత పాలకుల మాదిరిగా మాటలు చెప్పకుండా చేతల్లో చేసి చూపెడుతున్న సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానిలకు ధన్యవాదాలు. ఈ ఎన్నికల్లో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నానిలకు బీసీలు బాసటగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు సీఎం వైఎస్ జగన్‌కు తిరిగి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

– లక్కోజు రాజగోపాలాచారి, అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఏలూరు అర్బన్

స్థలం, నిధులు ఇచ్చారు



అఖిల భారత యాదవ మహాసభ జిల్లా, నగర కార్యాలయాల నిర్మాణంతో పాటుగా కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఏలూరు ఏటిగట్టు ప్రాంతంలో 350 గజాలు స్థలం, ఎమ్మెల్యే నిధులు రూ.7 లక్షలు, ఎంపీ నిధుల నుంచి రూ.7 లక్షలు నిధులు ఇచ్చారు. యాదవ సంఘ భవనం నిర్మించుకున్నాం. మాకు సహకరించిన ఎమ్మెల్యే ఆళ్ల నానికి, సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉంటాం. ఏలూరు పార్లమెంటు చరిత్రలో తొలిసారిగా ఒక బీసీకి ఎంపీ టిక్కెట్ ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.

– చిదరబోయిన శ్రీనివాసరావు, అధ్యక్షుడు, జిల్లా యాదవ సంఘం, ఏలూరు

ఏళ్లనాటి కల నెరవేరింది



ఏళ్లనాటి మా కలను నిజం చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. నాయీబ్రాహ్మణ సంఘం కార్యాలయం, కమ్యూనిటీ హాలు నిమిత్తం 500 గజాల స్థలంతో పాటు రూ.10 లక్షల నిధులను కేటాయించి ఎమ్మెల్యే ఆళ్ల నాని తన పెద్ద మనస్సును చాటుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల దూషణకు సంబంధించి జీఓ 50 విడుదలతో పాటు దేవస్థానాల ట్రస్టు బోర్డుల్లో స్థానం కల్పించింది. ప్రభుత్వానికి ధన్యవాదాలు. నాయీబ్రాహ్మణులు వైఎస్సార్ సీపీ వెంట నడిచేందుకు సిద్ధం కావాలి.

– కింజంగి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నాయీబ్రాహ్మణ సంఘం, ఏలూరు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



ఎప్పటి నుంచో రజకులకు ఉపయోగకరంగా ఉండే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలనే కోరిక ఉండేది. ఆ కోరికను ఎమ్మెల్యే ఆళ్ల నాని నిజం చేశారు. అడిగిన వెంటనే స్థలం కేటాయించారు. రూ.14 లక్షలు నిధులు కేటాయించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేసుకున్నాం. తమ్మిలేరు ఏటిగట్టున దీన్ని నిర్మించుకోవడం ద్వారా రజకులతో పాటు ఈ ప్రాంతంలోని పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– ప్రత్తిపాటి రామకృష్ణ, అధ్యక్షుడు, ఏపీ రజక వృత్తిదారుల సంఘం, ఏలూరు జిల్లా

మా ఓట్లు అమ్మబడవు



ఏలూరు కొత్తపేటలో మహిళ ఇంటి ముందు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓటర్లకు డబ్బులు, తాయిలాలు పంచటం సాధారణంగా మారింది. ఓటర్లు సైతం రాజకీయ పార్టీలు తమ ఓటుకు ఎంత ఇస్తారంటూ డిమాండ్ చేసే పరిస్థితి నెలకొంది. కానీ ఏలూరులో వినూత్నంగా ఒక మహిళ తన ఇంటిముందు పెట్టిన ఫ్లెక్సీ అందరినీ ఆకట్టుకుంది. ఏలూరు కొత్తపేటకు చెందిన కోట్ని పార్వతి అందరికీ ఆదర్శంగా నిలిచింది. తన ఇంటిముందు ×మా ఓట్లు ఎవరికీ అమ్మబడవు₹ అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయటం విశేషం. రాజ్యాంగ స్ఫూర్తిని చాటుకోవటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

పారిజాతగిరి వెంకన్నకు పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఉత్తరం వైపు ఏడు కొండల్లో ఆరో కొండపై వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో వేకువజామున సుప్రభాతసేవ ఆరాధన బాలబోగనివేదన తీర్థప్రసాదగోష్టి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. వేసవి కాలం కావడంతో భక్తులకు ఉచిత మజ్జిగ వితరణ ఆలయ కార్యనిర్వహణాధికారి చేయించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నరసన్నపాలెంనికి చెందిన తాత రామారావు, హైదరాబాద్‌కు చెందిన ఇ.కామరాజు, విజయవాడకు చెందిన తెల్లం సత్యనారాయణ నిర్వహించారు.

ఓటు వినియోగంపై అవగాహన కోసం..



అగ్గిపుల్లపై ఓటు అని రాయడంతోపాటు సిరా చుక్క

ఏలూరు (టూటౌన్): ఎన్నికల వేళ తన దైన శైలిలో ఓటర్లను చైతన్యం కలిగిస్తున్నారు సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్ బాబు. అగ్గిపుల్లపై ఓటు అక్షరాలను, ఓటు వేసిన సందర్భంగా వేసిన సిరా చుక్కను చూపుతున్నట్లు చిత్రీకరించారు. ఓటు వజ్రాయుధమని దాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

పూలే ఆశయాల సాధకుడు సీఎం జగన్



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): జ్యోతిబా పూలే సేవలకు గుర్తింపుగా నాటి బ్రిటీష్ ప్రభుత్వం మహాత్మా బిరుదుతో సత్కరించింది. సరిగ్గా 1888 మే 11న పూలేకు మహాత్మా బిరుదును ప్రదానం చేయడంతో దానిని మననం చేసుకుంటూ శనివారం పలువురు బీసీ సంఘాల నాయకులు స్థానిక జూట్ మిల్లు సెంటర్‌లోని పూలే దంపతుల విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు, బీసీల్లో చైతన్యం తెచ్చేందుకు పూలే దంపతులు ఎంతగానో కృషి చేశారన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సైతం పూలేను తన గురువుగా భావించారంటే పూలే దంపతులు చేసిన కృషి అర్థం అవుతుందని చెప్పారు. పూలే కలలు కన్న సమాజ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు అన్నింటా అగ్రతాంబూలం ఇచ్చిందని వివరించారు. ఏలూరు నియోజకవర్గం చరిత్రలో బీసీలకు ఇంతటి ప్రాధాన్యత ఎన్నడూ దక్కలేదని అన్నారు. బీసీల వెన్నంటి నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌లను ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలోని బీసీలంతా తమ ఆత్మ సాక్షిగా తమకు మేలు చేసిన ఆళ్ల నాని విజయం కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర నాయకులు ఉక్కుసూరి గోపాల కృష్ణ, పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

ముగ్గులు పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు ప్రాముఖ్యతపై ఏర్పాటు చేసిన ముగ్గులు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకొని, సరైన ప్రభుత్వాన్ని ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. జిల్లాలో గత ఎన్నికల్లో సగటు 83 నుంచి 84 శాతం పోలింగ్ నమోదు కాగా 2024 ఎన్నికల్లో కనీసం 90 శాతం ఓటింగే లక్ష్యంతో స్వీప్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా రెండు వేల కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పోలీస్ అబ్జర్వర్ టి.శ్రీధర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ప్రజాస్వామ్య పండుగలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళలు సుందరవంతంగా నిర్వహించిన దీపాలంకరణ, ముగ్గుల పోటీ, ఎంతో ఆకట్టుకొనే రీతిలో ఉన్నాయన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలైన వైవీ సత్యవతికి రూ.20 వేలు, పద్మావతికి రూ.15 వేలు, నాగేశ్వరమ్మ రూ.10 వేలు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను ప్రదానం చేశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	100
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	04-06
బెండకాయలు	36	కంద	72
పచ్చిమిర్చి	64	బీట్‌రూట్	36
కాకర కాయలు	34	కీరా దోస	30
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	168
బీరకాయలు (పందిరి)	48	అల్లం	160
క్యాబేజీ	26-28	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34-48	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	28	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	22	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	38-44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	20.15	4802	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు -తిరుపతి	16.00	4830	30

ఆకర్షణీయంగా పోలింగ్ బూత్‌లు



సుంకరవారితోటలో పింక్ కలర్‌లో ఏర్పాటు చేసిన బూత్ 211వ పోలింగ్ బూత్ వద్ద ఆర్వో ముక్కంటి, కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరులో ఓటర్లను ఆకర్షించేలా పోలింగ్ బూత్‌లను సుందరంగా తీర్చిదిద్దారు. మోడల్ పోలింగ్ కేంద్రాలుగా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం లోపలి గోడలను పూలు, పచ్చని ఇండోర్ ప్లాంట్స్, ఓటు విలువను తెలిపే ఫ్లెక్సీలు, పోలింగ్ కేంద్రానికి వెళ్లే మార్గం పూలకుండీలతో అలంకరించారు. వీటిని ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సహకారంతో ఏలూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ముక్కంటి, ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ప్రత్యేక శ్రద్ధతో రూపకల్పన చేశారు. ఏలూరు సుంకరవారి తోటలో పోలింగ్ బూత్ 211ను పింక్ కలర్‌తో మహిళా పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. ఏలూరు కట్టా సుబ్బారావుతోట గవరవరంలో ఆదర్శ పోలింగ్ బూత్‌ను, సాయినగర్‌లో యువతతో నడిపేలా ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ను, వికలాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు.

‘జగనన్నకు ప్రత్యామ్నాయం లేదు’

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రి జగనన్నకు ప్రత్యామ్నాయం లేదని, గతంలో ఎందరో ముఖ్యమంత్రులుగా చేసినా రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేసిన వారు లేరని వైఎస్సార్ సీపీ 23వ డివిజన్ కార్యదర్శి కుప్పాల అంజనేయులు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆళ్ల నాని, కారుమూరి సునీల్ కుమార్‌ల విజయాన్ని కాంక్షిస్తూ శనివారం స్థానిక 23వ డివిజన్‌లో అంజనేయులు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పేదల విద్యకు ముఖ్యమంత్రి జగన్ పెద్దపీట వేశారని, అక్క చెల్లెమ్మలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే అశయంతో వారికి నేరుగా డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకే నగదు జమ చేసి సంక్షేమంలో కొత్త ఒరవడి సృష్టించారని అంజనేయులు చెప్పారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలను ఓటుతో తిప్పికొట్టి జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఏలూరులో పేదల వైద్య సేవల కోసం ఎమ్మెల్యే నాని వైద్య కళాశాల తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గండికోట రంగారావు, కుప్పాల రాంబాబు, ఆర్ కోటి, ఎ.శంకర్, కె.దుర్గారావు, ఆర్ వంశీ, ఎన్ దినేష్ పాల్గొన్నారు.

ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ సమర్పించాలి

ఏలూరు(మెట్రో): ఎన్నికల సిబ్బంది విధిగా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ తమ కార్యాలయాల్లో సమర్పించాలని ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చోడగిరి శ్రీనివాస్, నెరుసు రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ వినతి మేరకు ఎన్నికల కమిషన్ సిబ్బందికి 14వ తేదీ ఓడీగా ప్రకటించిందని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చేలా ఆర్‌వోలకు ఆదేశాలు ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి ఈసీ సూచించిందని తెలిపారు.

13న డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు ఎన్నికల రోజునే అందచేయాలని ఏలూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశామని పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు తెలిపారు.